సరుగుడు తోటలతో సిరులు

★ వరి, చెరకుకు ప్రత్యామ్నాయంగా సాగు
★ మక్కువ చూపిస్తున్న రైతులు
★ ఏడాదికేడాది పెరుగుతున్న విస్తీర్ణం


కుసర్లపూడిలో ఏపుగా ఎదిగిన సరుగుడు తోట


ఏటికొత్తూరులో నాటిన సరుగుడు మొక్కలు

రోలుగుంట : సరుగుడు సాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ఈ పంటకు చెరకు, వరితో పల్చుకుంటే సాగు వ్యయం తక్కుగానే ఉండడం, ఒకసారి నాట్లు వేసి మొక్క పెరిగే వరకూ సంరక్షిస్తే నాలుగేళ్లలో తోట కోతకు రావడంతో రైతులకు రాబడి ఆశించిన మేరకు వస్తోంది. వరి, చెరకు సాగు చేపట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ తెగుళ్లు, సాగునీటి కష్టాలు రైతులు ఎదుర్కోక తప్పడం లేదు. దీంతో వాటి స్థానంలో తక్కువ పెట్టుబడి అయ్యే సరుగుడు సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

మండలంలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం 1210 హెక్టార్లు, చెరకు సాగు విస్తీర్ణం 214 హెక్టార్లు మాత్రమే. కాగా సరుగుడు సాగు విస్తీర్ణం సుమారు 4,150 ఎకరాలు ఉంది. సరుగుడు సాగు ఏటా పెరుగుతుంది. చెరకు ఎకరాకి పెట్టుబడి సుమారు రూ.35 నుంచి రూ.45వేలు కాగా దిగుబడి ఎకరాకి అధికంగా 20 టన్నులు అయితే స్వల్పంగా 13, 14 టన్నులు మాత్రమే వస్తోంది. దీంతో పెద్దగా పెట్టుబడులు అవసరం లేని నాలుగేళ్లలో పెద్ద మొత్తంలో ఆదాయం ఒకేసారి వచ్చే సరుగుడుపై ఆసక్తి చూపుతున్నారు.. చెరకు టన్ను ధర రూ.3,150 అయితే సరుగుడు టన్ను ధర రూ.7 వేలు నుంచి రూ.9 వేల వరకూ పలుకుతుంది. ఎకరాకు సాగుకు రూ.50 వేలు అయితే అయిదేళ్ల తరువాత ఎకరాకు 45 టన్నుల నుంచి 70 టన్నుల దిగుబడి వస్తోంది. సుమారుగా రూ.4 లక్షల ఆదాయం ఉంటుంది. దీంతో సాగు చేసేవారి సంఖ్య పెరుగుతూ వస్తుంది.

ఆదాయం బాగుంది..



సరుగుడు ఎకరాకు 45 నుంచి 70 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఆదాయం కూడా నాలుగు లక్షల రూపాయల మించి వస్తోంది. ఖర్చు తక్కువ. నాలుగేళ్లలో మంచి ఆదాయం వస్తుంది. -పారుపల్లి అప్పలనాయుడు, రైతు, రోలుగుంట

పెంపకం సులభం



సరుగుడు మొక్కలు నాటి మొక్క బతికి ఎదిగే వరకూ కలుపు మొక్కలు తొలగించి సంరక్షించుకుంటే సరిపోతుంది. సరుగుడు ఒకసారి వేస్తే చాలు నాలుగు, అయిదేళ్లలో తోట ఎదిగి కోతకు వస్తుంది. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి పంట కొనుగోలు చేస్తారు. అంతర పంటలు కూడా వేసుకునే అవకాశం ఉంది.
-రుత్తల నానిబాబు, రైతు, రోలుగుంట

చెరకుతో పోలిస్తే లాభమే..



చెరకు పంటకు సుమారుగా ఎకరాకి రూ.40 వేలు పైన పెట్టుబడి అవుతుంది. పెట్టుబడి కోసం అప్పులు కూడా చేయాలి. పంట అభివృద్ధి బాగుంటే రూ.55 వేలు పైబడి ఆధాయం ఉంటుంది. పెట్టుబడికి తగ్గ ఆదాయం ఉండడం లేదు. చేసిన అప్పుకు వడ్డీ లెక్క వేస్తే ఆదాయానికి సరిపోవడం లేదు. ప్రభుత్వం చెరకు టన్ను మద్దతు ధర రూ.5 వేలకు పైగా చెల్లిస్తేనే రైతుకు మనుగడ ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
-కర్రి వీరునాయుడు, రైతు, కొండ పాలెం

క్లుప్తంగా

మోదకొండమ్మకు సర్పంచ్ వెండి బహూకరణ


అమ్మవారికి వెండిని బహూకరిస్తున్న సర్పంచ్ కళావతి

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి దంపతులు పావుకిలో వెండిని బహుకరించారు. మహిమాన్వితమైన మోదకొండమ్మ అమ్మవారికి వెండిని అందించడం ఆనందంగా ఉందని సర్పంచ్ తెలిపారు. ఈ వెండిని సోమవారం అమ్మవారి ఆలయంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. కార్యక్రమంలో మాడుగుల మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వర్ల ఊరేగింపు


విగ్రహాలు ఊరేగిస్తున్న దృశ్యం

గొలుగొండ: చిన్నయ్యపాలెం గ్రామంలో సోమవారం గౌరీపరమేశ్వర్ల విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వర స్వామికి సారేతో ఘనంగా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపులో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పశువులకు డీవార్మింగ్ మందులు


రైతులకు మందులు అందిస్తున్న పశువైద్యాధికారి రమేష్

గొలుగొండ : పశు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. గొలుగొండ, చీడిగుమ్మల, ఏఎల్ పురం ప్రాంతాల్లో సోమవారం డీవార్మింగ్ మందులు అందజేశారు. సుమారుగా మూడు పశు వైద్య కేంద్రాల్లో మేకలు, గొర్రెలు, పాడి పశువులకు గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న వాటికి పశువైద్య పరీక్షలు నిర్వహించి వాటికి మందులు అందజేశారు. రైతులు అప్రమత్తంగా ఉండి మూగజీవులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడుతో పాటు పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జోరుగా వరి నూర్పులు


శరభవరంలో యంత్రాలతో వరి నూర్పులు చేపడుతున్న రైతులు

రోలుగుంట : మండలంలో గల గ్రామాల్లో వరి పంట నూర్పుల పనులు జోరందుకున్నాయి. ఖరీఫ్ వరి సాగు అనంతరం కోతలు చేపట్టి కుప్పలు పెట్టుకున్నారు. వారంతా సంక్రాంతి పండగ ముగిసాక నూర్పులు చేపట్టారు. కొందర యంత్రాలతో నూర్పులు చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల నూర్పు రెండు గంటల సమయం పడితే నూర్పుల యంత్రానికి గంట సమయం మాత్రమే పడుతుంది. వెంట వెంటనే గింజలు వేరి చేసి బస్తాల్లో నింపుకొనే సౌలభ్యం ఉండడంతో రైతులు గాలిపోత యంత్రాలపై మక్కువ చూపుతున్నారు. గంటకు ఈ యంత్రానికి రూ.1800 ఖర్చవుతుంది. శరభవరం, రాజన్నపేట, బుచ్చింపేట, రోలుగుంట తదితర గ్రామాల్లో నూర్పులు జరుగుతున్నాయి.

పారిశుధ్య లోపంపై ఫిర్యాదు

మాకవరపాలెం: మండలంలోని జీ కోడూరులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని గ్రామానికి చెందిన కె.వి.ఎస్.అప్పారావు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ఉందని, అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెత్త తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

కుష్టు వ్యాధిపై ఇంటింట సర్వే


ఎ.కోడూరులో ఇంటింట సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి అనుమానితులుగా గుర్తించడం జరుగుతుందని లంకవాని పాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. మండలంలో ఎ.కోడూరు గ్రామంలో సోమవారం కుష్టు వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించడానికి ఇంటింట సర్వేలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సర్వేను ఫిబ్రవరి 2 వరకూ నిర్వహించాలని తెలిపారు. ఎ.కోడూరు గ్రామంలో 1050 ఇళ్లలో వైద్య సిబ్బంది సర్వేను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు గల వారిని ముందుగానే గుర్తించడం ద్వారా మల్టీ డ్రగ్ థెరపీ(ఎండీటీ) మాత్రలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ముందస్తుగా మాత్రలను వ్యాధి లక్షణాలు గల వారికి ఇవ్వడం వల్ల వ్యాధి వల్ల తలెత్తే అంగవైకల్యం, నరాల బలహీనత వంటి సమస్యలు రాకుండా చూడగలమని త్రినాథ్ తెలిపారు. ఈ సర్వే ద్వారా అనుమానిత లక్షణాలు గల వారిని గుర్తించి వారికి కుష్టు నిర్ధారిత పరీక్షలను చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రమీలా, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్ఎం సంతోషికుమారి పాల్గొన్నారు.

ఘనంగా రావాలమ్మ తీర్థం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు : కె.కోటపాడు, కింతాడ గ్రామాల ఆరాధ్యదేవత రావాలమ్మ అమ్మవారి తీర్థం రెండు గ్రామాల ప్రజలు సోమవారం నిర్వహించారు. మహిమాన్వితమైన అమ్మవారిగా గుర్తింపు పొందిన రావాలమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు రెండు గ్రామాల ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు గ్రామం ప్రధాన వీధుల్లో సందడి నెలకొంది. రాత్రి కింతాడ గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనాధు ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకార పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

మాడుగుల : ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాడుగుల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో చోడవరం దేవీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన మహాసభలో ప్రమాణ స్వీకార పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాడుగులలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 130 ఏళ్ల చరిత్ర గలిగిన ఆర్యవైశ్య సంఘంలో తొలిసారిగా చోడవరంలో జరిగిన మహాసభకు రాష్ట్రం నలు మూలల నుంచి అతిరథ మహారథులు రావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య సంఘం కర్నూల్ చైర్మన్ సోమిశెట్టి వేంకటేశ్వర్లు, డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డి.రాకేష్, రాష్ట్ర సంఘం కన్వీనర్ అంబికా కృష్ణ, మహిళా అధ్యక్షురాలు కె.రజని, సంఘ రాష్ట్ర సభ్యులు పెనుకొండ సుబ్బరాయుడు, ఇల్లూరి లక్ష్మయ్య, నుదురుపాటి శ్రీనివాస్, పళ్లపోతుల వేంకటేశ్వరరావు, శేరుషణ్ముఖరావు, గొట్ల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. దీంతో మాడుగులలో శ్రీనివాసరావును ఆర్యవైశ్య మండల కమిటీ దుశ్సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా కమిటీకి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరం


పోతనవలసలో పశువైద్యం అందిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : పశువులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడం ద్వారా పశునష్టం కలగకుండా చర్యలను తీసుకోవచ్చునని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. పోతనవలస గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 15 పశువులకు సాధారణ చికిత్సలు, 25 పశువులకు గర్భకోశ చికిత్సలు, 15 పశువులకు చూడి తనిఖీలు, 20 పెయ్యిలకు నట్టల నివారణ మందులను అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు వి.హనుమంతు, లింగేశ్వర రావు, సర్పంచ్ చిరికి భార్గవి పాల్గొన్నారు.

డెయిరీ రైతులకు రూ. 59 కోట్ల బోనస్ పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టరు సూర్యనారాయణ, మేనేజరు సత్యనారాయణ

నాతవరం : విశాఖ డైయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు డైయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో ఈ ఏడాది రూ.59 కోట్లకు పైగా బోనస్ ఇచ్చామని విశాఖ డైయిరీ డైరెక్టరు శ్రీరంరెడ్డి సూర్యనారాయణ అన్నారు. మండలంలో తాండవ జంక్షన్‌లో గల డైయిరీ బల్క్ కూలింగ్ కేంద్రం వద్ద పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం విజయనగరం శ్రీకాకుళం జిల్లాల పరిధిలో విశాఖ డైయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు సంక్రాంతి ముందు పండగ బోనస్ పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం పాలకేంద్రంలో వివిధ క్యాడర్‌లలో పని చేస్తున్న సిబ్బందికి బోనస్ పంపిణీ చేస్తున్నామన్నారు. పండగ బోనస్ నర్సీపట్నం బ్రాంచి డైయిరీ పరిధిలో రూ.6కోట్లు పైగా చెల్లింపులు చేసామని, డెయిరీలో వివిధ క్యాడర్‌లో పని చేసే సిబ్బందికి రూ. 12 లక్షలు బోనస్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. డైయిరీ పరిధిలో పని చేస్తున్న అన్ని జిల్లాలో సిబ్బందికి బోనస్ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ప్రైవేటు పాలకేంద్రాలు గణనీయంగా పెరగడం వల్ల పాలకు మార్కెట్లో గిరాకీ తగ్గిందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని పాలు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందులో భాగంగానే ఆవు పాలు కంటే గేదె పాలు సేకరణ పెంచాలని నిర్ణయించామన్నారు. ఇప్పుడు విశాఖ డైయిరీకి ఆవు పాలు అధికంగా వస్తున్నాయని, గేదె పాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల రీత్యా గేదె పాలు ఉత్పత్తితోపాటు నాణ్యత పెంచాలన్నారు. ఈ విషయాన్ని పాడి రైతులు, పాలకేంద్రాల సిబ్బంది గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పాల కేంద్రం మేనేజరు సిహెచ్.సత్యనారాయణ గోపాలమిత్రలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, సూపర్‌వైజరు ఎస్.సతీష్, పాలకేంద్రం అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, పాడి రైతులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

మాడుగుల రూరల్ : మండలంలో గల గొటివాడ అగ్రహారం గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు మాడుగుల పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు తెలిపారు. వీరనారాయణం, ఎం.కోటపాడు, వీరవల్లి, చింతలూరు గ్రామాల పరిధిలో ఉన్న పాడి రైతులంతా ఏడాదిలోపు వయస్సు ఉన్న జెర్సీ, హెచ్ఎఫ్, ఒంగోలు, ముర్రా జాతులకు చెందిన లేగ దూడలను తీసుకొచ్చి ప్రదర్శనలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ, పశు గణాభివృద్ధిశాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

'హైందవ శంఖారావం' ప్రతినిధుల సమావేశం

ముదుగుల రూరల్ : ఈ నెల 5వ తేదీన విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందూ బంధువులను అధిక సంఖ్యలో తరలించడంలో ముఖ్యపాత్ర పోషించిన 25 మంది బస్సు ప్రముఖులు, ఖండ కన్వీనర్, సహ కన్వీనర్ సభ్యులతో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు కేజేపురం జంక్షన్‌లోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య బాధ్యులంతా తప్పక హాజరు కావాలని రాపేటి కొండలరావు, మాడుగుల ఖండ కన్వీనర్ ఉండూరు శ్రీనివాసరావు, సహ కన్వీనర్, సభ్యులు సత్యారావు. శివాజీరాజు కోరారు.

నేడు పైడిమాంబ తీర్థం

దేవరాపల్లి : కొత్తపెంటలో పైడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని గ్రామస్తుల సహాయ సహకారాలతో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ రొంగలి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


రాజాంలో హోరాహోరీగా కబడ్డీ పోటీలు

బుచ్చెయ్యపేట : రాజాం గ్రామంలో ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పలువురు భక్తులు ఆంజనేయస్వామికి కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ చూపారు. అర్ధరాత్రి వరకు కబడ్డీ పోటీలు క్రీడాకారుల మధ్యన హోరాహోరీగా జరిగాయి. కబడ్డీ పోటీలో గెలుపొందిన మొదటి నలుగురు విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలసి బహుమతులు అందజేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మరిడిమాంబ తీర్థంలో ఎడ్ల పోటీలు


పోటీలో ఉరకలు వేస్తున్న గిత్తలు

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో సోమవారం మరిడిమాంబ తీర్థం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు తెల్లవారి నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి రామారావు, ఉపసర్పంచ్ వొమ్మలి పెంటయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మాకవరపాలెం : డ్రైనేజీ పనులకు మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ నుంచి అడవిరాజులబాబు ఆలయానికి వెళ్లే మార్గంలో డ్రైనేజీ సక్రమంగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రూ.5 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్ లాలం రాము శంకుస్థాపన చేశారు.

డ్వాక్రాలకు రూ. 66 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు


మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కనకరాజు

నాతవరం : డ్వాకా సంఘాలకు ఈఏడాది రూ.66 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని వెలుగు ఏపీఎం కనకరాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జీడి మామిడి గొర్రెలు ఉత్పత్తిదారులు సంఘాలు సభ్యులకు డ్వాక్రా సంఘాలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1628 డ్వాకా సంఘాలు ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం అర్హత అనుసరించి బ్యాంకు ద్వారా డ్వాక్రా సంఘాలకు రూ.45 కోట్లు పైగా ఇంతవరకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మార్చి నాటికి శత శాతం లక్ష్యాన్ని అధిగమించి రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. డ్వాక్రా గ్రూపులు మాదిరిగానే జీడిమామిడి తోటలు గొర్రెలు, మేకలు ఉత్పత్తిదారుల సంఘాలు సభ్యులకు ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్నారు. గతంలో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించే లబ్ధిదారులకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు కోరుబిల్లి మణి, వెలుగు అధికారులు, డ్వాక్రా సంఘాలు సభ్యులు, గొర్రెలు, మేకల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆర్డీవో వి.వి.రమణ


అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ఆరు ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. రోలుగుంట మండలం, బుచ్చంపేట గ్రామానికి చెందిన అనిమిరెడ్డి శ్రీను ఆన్‌లైన్‌లో భూమి వివరాలను సరి చేయాలని ఆర్జీ పెట్టుకున్నారు. నాతవరం మండలం, మర్రిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన స్థలాన్ని చిట్టిమ్మ అక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నారని యాదగిరి పెద నూకరాజు, నూకరాజు, అర్జున్ తదితరులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో భూ వివరాలు తప్పుగా పడిందని సరి చేయాలని కోరుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ గచ్చపువీధికి చెందిన పల్లా లోవలక్ష్మి ఆర్జీ పెట్టుకున్నారు. రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల కోసం అర్జీలు వచ్చాయి. పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

పశువైద్య శిబిరాలు ప్రారంభం


కె.అగ్రహారంలో మందులు పంపిణీ చేస్తున్న ఏడీ నరేష్


గోడ పత్రికలను విడుదల చెస్తున్న ఎమ్మెల్యే బండారు

మాకవరపాలెం: మండలంలోని కొండలఅగ్రహారం, శెట్టిపాలెంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రత్యేక శిబిరాల ఏర్పాటులో భాగంగా సోమవారం ఈ రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పశువులకు సోకే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీ నరేష్ పాడిరైతులకు వివరించారు. వైద్యాధికారులు మణిదీప్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు

చీడికాడ : పశు ఆరోగ్య శిబిరాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని చెట్టుపల్లిలో పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువులకు, పెయ్యిలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను తాగించి శిబిరాలను ప్రారంభించారు. ఈ నెల 20 నుంచి 31 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకులు డా.చిట్టినాయుడు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : పోతనపూడి అగ్రహారం,డి.సురవరం గ్రామాల్లో సోమవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ గ్రామాల్లో 23 పశువులకు సాధారణ చికిత్సలు. రెండు పశువులకు కృత్రిమ గర్భధారణ, 26 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 42 పశువులకు, 46 పెయ్యిలకు, 393 గొర్రెలు, మేకలకు చికిత్సలు చేసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 634 గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాలు వేశారు. పశువైద్యులు మణిలక్ష్మణ్, ఆరుణ కిరణ్, సర్పంచులు సాంబమూర్తి, జయమ్మ, ఎంపీటీసీ శ్రీనాథ్ అప్పారావు, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, పశువైద్య సహాయకులు నానిబాబు, కన్నంనాయుడు, చంద్రరావు, కృష్ణారావు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తిమిరాం, కాశీపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. కాశీపురంలో ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి, తిమిరాంలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి. ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించారు. తిమిరాంలో జరిగిన పశు ఆరోగ్య శిభిరాన్ని సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ సింహాచలంనాయుడు, కాశీపురంలో సర్పంచ్ వరలక్ష్మి ప్రారంభించారు. ఈ రెండు గ్రామాలలో 98 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

నర్సీపట్నం : పశువైద్య శిబిరాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి, నగరం పంచాయతీల్లో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. పశువైద్య సహాయ సంచాలకులు, డబ్ల్యూ, రాంబాబు, వైద్యాధికారిణి పుష్ప పాల్గొని 56 పశువులకు నట్టల నివారణ టీకాలు వేశారు. గొర్రెలు, మేకలు 50, పెయ్యిలు 12 నట్టల నివారణ మందు వేశారు. 33 పశువులకు గర్భకోశ చికిత్సలు, 92 కోళ్లకు టీకాలు వేశారు.

ఇంటింటా ఆరోగ్య పింఛన్ల తనిఖీలు


దేవరాపల్లిలో వృద్ధుడిని పరిశీలిస్తున్న పింఛన్ల తనిఖీ వైద్య బృందం

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా వైద్యుల బృందం పింఛన్ల తనిఖీ ప్రక్రియను సోమవారం చేపట్టారు. గ్రామాల్లో ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, ధ్రువపత్రాలు, అర్హతను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని 27 పంచాయితీల పరిధిలో దీర్ఘకాలిక, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన 74 మంది పింఛను దార్లకు సంబంధించి మండలానికి వచ్చిన నాలుగు వైద్య బృందాలు వేర్వేరుగా తనిఖీలు చేపట్టారు. ఈ బృందంలో ఆర్థోపెడిషియన్, జనరల్ మెడిసిన్ వైద్యులతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఉన్నారు. వైద్యులు ఇంటింటా పర్యటించి తనిఖీలు చేపడుతుండడంతో ఎవరి పింఛన్లు తొలగిస్తారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పింఛన్ల తనిఖీ ప్రక్రియలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఈ.పూజ్య మేఘన, బి. రవితేజ పాల్గొన్నారు.